క్లుప్తంగా

పరామర్శ



రెడ్డి తిరుపతినాయుడిని పరిమర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్: మండలంలోని భాగువలస కు చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి తిరుపతినాయుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆదివారం గ్రామానికి చేరుకుని తిరుపతినాయుడును పరామర్శించారు. రాజన్నదొరతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

కథల పోటీలు

గరుగుబిల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పోటీలు ఆదివారం నిర్వహించారు. వియ్ లవ్ రీడింగ్ కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులతో తొలుత పుస్తకాలు, కథలు చదివించారు. ఆ తర్వాత కథల పోటీలు చేపట్టి, ఈ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన చిన్నారులను లైబ్రేరియన్ మధుసూదనరావు అభినందించారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

భామిని: భామిని ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8 తరగతులలో మిగులు సీట్లకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 7వ తరగతిలో 8 సీట్లు, 8వ తరగతిలో 4సీట్లు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసిన వారికి ఈ నెల 15న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

సీతంపేట: స్థానిక జీహెచ్ స్కూల్‌లో పదో తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం స్థానిక సామాజిక భవనం వద్ద ఆదివారం నిర్వహించారు. 2000 బ్యాచ్ విద్యార్థులతో పాటు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను నెమరువేసుకుంటూ రోజంతా సరదాగా గడిపారు. కార్యక్రమంలో 80 మంది పూర్వ విద్యార్థులతో పాటు పూర్వ హెచ్ఎం లలితాంబ, ఉపాధ్యాయులు అమ్మారావు, గోవిందరావు, లక్ష్మణరావు, ఫాణి, శేఖర్, నాగేశ్వరరావు, శివరాం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాన విభావరి

పాలకొండ రూరల్: స్థానిక దక్షిణాముఖ ఆంజనేయ ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక, సినీ గేయ గాన విభావరి ఎంతగానో అలరించింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ సత్యప్రభ, ఉపాధ్యాయులు చల్లా కృష్ణ పలు గీతాలను ఆలపించి శ్రోతలను అలరించారు. అలాగే ఆలయంలో అర్చకులు ఆంజనేయశర్మ నేతృత్వంలో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఆర్బీకేలకు చేరిన వరి విత్తనాలు



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

పాలకొండ: ఖరీఫ్‌లో రైతులకు కావాల్సిన వరి విత్తనాలు రైతుభరోసా కేంద్రాలకు చేరాయి. సాంబమసూరి, స్వర్ణమసూరి, 1121, ఆర్‌జేఎల్ వంటి విత్తన రకాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. రైతులు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించి తమకు కావాల్సిన విత్తనాలను తీసుకోవాలని ఏఓ వాహిని తెలిపారు. ప్రస్తుతం మృగశిర కార్తె ప్రారంభం కావడంతో వరి వెదలు వేసుకునేందుకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో పలువురు రైతులు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు.

కోటదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



ఘటాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

పాలకొండ రూరల్: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం పాలకొండ కోటదుర్గమ్మ సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఘటాలు, ముగ్రాటలతో కాలినడకన ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన పలు రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి పూజలు చేశారు. ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద శర్మ నేతృత్వంలో అమ్మవారికి చల్లదనం చేశారు. ఈ క్రమంలో భక్తుల సాంప్రదాయ శక్తి వేషధారణలు, డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కట్టు కడితే కలవాల్సిందే..

- ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తుడు సంగంవలస సత్యనారాయణ
- ఉచితంగా రోగులకు సేవలు
- ఎముకుల వైద్యంలో చేయి తిరిగిన నైపుణ్యం

పార్వతీపురం టౌన్:

కొండలపై పెరిగిన ఔషధ మొక్కలే అతడి వైద్యానికి ఆధారం. ఏ మొక్క ఏ రోగాన్ని నయం చేస్తుందో తండ్రి నుంచి నేర్చుకుని, వనమూలికా వైద్యంపై పట్టు సాధించారు. ప్రకృతితో మమేకమవుతూ పచ్చని కొండల్లో వనమూలికలతో కూడిన వైద్యం అందిస్తున్నారు. ఎముకల వైద్యంలో సిద్ధహస్తుడిగా పేరుపొందారు. ఆయనే.. సంగంవలస సత్యనారాయణ. ఆయన అందిస్తున్న ఉచిత ప్రకృతి వైద్యసేవలపై 'సాక్షి'' స్పెషల్ కథనం....

పార్వతీపురం జిల్లా కేంద్రానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంది సంగంవలస. ఆ ఊరి పేరు చెబితే ముందుగా గుర్తుకు వచ్చేది ఆ గ్రామంలో అందించే వనమూలికలతో కూడిన వైద్యసేవలే. ప్రకృతి వైద్యంతో ఎముకలు సరిచేయడంలో బడే సత్యనారాయణ ఎంతో పేరు పొందారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఆయన.. తన తండ్రి స్వామినాయుడు నుంచి వైద్యం నేర్చుకున్నారు. మానవ శరీరంలోని ఎముకల అమరికపై పట్టు సాధించారు. కొండలపై లభించే వనమూలికలతో కట్టు వేస్తూ రోగులను బాగు చేస్తున్నారు. ఆయన వద్దకు వైద్యం కోసం వచ్చేవారికి ఉచిత సేవలతో స్వాంతన చేకూరుస్తున్నారు. ఇప్పుడు ఆయన వద్దకు ఆంధ్రా, ఒడిశా నుంచి ప్రతిరోజూ సుమారు వంద మంది వరకు రోగులు వస్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి..

సత్యనారాయణ వద్ద వైద్యం పొందేందుకు జిల్లా



సంగంవలస గ్రామం



కట్లు కడుతున్న సత్యనారాయణ



గత సబ్ కలెక్టర్ చేతన్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న బడే సత్యనారాయణ

వాసులే కాకుండా ఒడిశా రాష్ట్రం నుంచి కూడా రోగులు వస్తున్నారు. ప్రతిరోజూ రోగుల తాకిడి ఉంటుంది. ఆది, బుధవారాల్లో ఎక్కువ మంది వస్తుంటారు.

పసరుతో వైద్యం..

వనమూలికల పసరుతోనే ఎముకలను అతికించడం సత్యనారాయణ ప్రత్యేకత. చేతి, కాలు, భుజం, వెన్నుపూస, తదితర ఎముకల సంబంధిత సమస్యలతో బాధపడేవారికి కట్లు కట్టి నయం చేస్తున్నారు. చేయి, కాలు ఎముకలు విరిగిపోయే వారికి నాలుగు పర్యాయాలు కట్టుకట్టి సాధారణ స్థితికి చేర్చుతున్నారు.

వెదురు బద్దలతోనే...

విరిగిన ఎముకలకు వెదురు బొంగులను బద్దలుగా చీల్చి దన్నుగా కడతారు. వనమూలికలతో తయారు చేసిన పసర నూనెలో దూది ముంచి విరిగిన ప్రాంతంలో వేసి గుడ్డతో గట్టిగా కట్టు కడతారు. నొప్పి తగ్గేందుకు కొండలపై దొరికే ఔషధ మొక్కల ఆకులు, వేర్లతో తయారు చేసిన మాత్రలు అందజేస్తారు. ఇలా నాలుగు పర్యాయాలు కట్లువేసి విరిగిన ఎముకలు అతికేలా చేస్తున్నారు.

ఊరికి పేరు తెస్తా...

మా తండ్రి స్వామినాయుడు వద్ద ప్రకృతి వైద్యం నేర్చుకున్నాను. రోగులకు ఉచిత సేవలు అందిస్తున్నాను. ఎంతోమంది పట్టణానికి వచ్చి వైద్యసేవలు అందజేయాలని ఆహ్వానిస్తున్నారు. ఊరిపై ఉన్న ప్రేమతో సంగంవలసలోనే ఉండి వైద్యసేవలు అందిస్తున్నాను. నా తండ్రి ఆశయాలకు అనుగుణంగా సేవ చేస్తున్నాను. చుట్టుపక్కల వనమూలికల పసరతో తయారు చేసిన నూనెను కీళ్ల నొప్పులు తగ్గేందుకు అందజేస్తున్నా. – బడే సత్యనారాయణ, సంగంవలస

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1979 – 80 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. అప్పటి గురువులను సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో సుదర్శన హోమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్.శర్మయాజీ సహకారంతో అర్చకులు సత్తె నరసింహాచార్యులు ఆధ్వర్యంలో హోమం, తదితర పూజలు చేపట్టారు. ఈ హోమం చేసిన వారికి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి, భక్తులకు అన్న ప్రసాదం పంచిపెట్టారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో పాలకొండ నియోజకవర్గంలో జనసేన గెలుపొందిన నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణతో కలిసి ముందుకు వెళ్తామని ఆ పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు అన్నారు. ఆదివారం పాలకొండలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో జనసేనకు మద్దతిచ్చినందుకు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో జనసైనికులతో పాటు టీడీపీ, బీజేపీ నాయకులతో సమన్వ యం చేసుకుని నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవగాం బిర్యానీ రుచే వేరయా..!

వీరఘట్టం: నాయుడు బిర్యానీ అంటే వీరఘట్టం, పాలకొండ మండలాల్లో తెలియని వారు లేదంటే అతిశయోక్తి కాదు. వీరఘట్టం–పాలకొండ మండలాల మధ్యలో ఉన్న నవగాం సెంటర్‌లో మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ బిర్యానీ పాయింట్‌తో నవగాం సెంటర్ వ్యాపార పరంగా అభివృద్ధి చెందిందని చెప్పవచ్చు. కేవలం రూ.100లకే రుచికరమైన చికెన్ బిర్యానీ విక్రయిస్తుండడంతో ప్రతిరోజు పెద్ద సంఖ్యలో ఆడర్లు వస్తుంటాయి. చికెన్ ధరలు పెరిగినా మూడేళ్లగా బిర్యానీ ధర పెంచకుండా విక్రయిస్తుండటం విశేషం. నవగాంకు చెందిన నాయుడు వీరఘట్టంలోని ఓ హోటల్‌లో వంట మాస్టర్‌గా పనిచేసేవాడు. కోవిడ్ సమయంలో హోటళ్లు మూతపడటంతో జీవనోపాధి కోల్పోవాల్సి వచ్చింది. కోవిడ్ తగ్గుముఖం పట్టాక నవగాం సెంటర్‌లోనే బిర్యానీ పాయింట్‌ను తెరిచాడు. పార్సిల్ రూ.100లు చొప్పున విక్రయించాడు. రుచి, నాణ్యత బాగుండటంతో అనతికాలంలోనే నాయుడు బిర్యానీ పాపులర్ అయ్యింది. అనంతర కాలంలో ఈ సెంటర్‌లో పలు బిర్యానీ పాయింట్లు ఏర్పడినా నాయుడు బిర్యానీకి ఉన్న క్రేజ్ మాత్రం తగ్గలేదు.



బిర్యానీ పార్సిళ్లను సిద్ధం చేస్తున్న నాయుడు

రోజుకు సుమారు 250 నుంచి 300 వరకు పార్సిళ్లను విక్రయిస్తున్నామని, అన్ని ఖర్చులు పోనూ రోజుకు సుమారు రూ.4 వేల వరకు మిగులుతుందని నాయుడు అంటున్నాడు. తాను స్వయం ఉపాధి పొందడంతో పాటు మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నాడు.

వివాదాలకు అవకాశం ఇవ్వొద్దు



గటాలదెప్పివారివీధిలో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్సై

పాలకొండ రూరల్: క్షేత్రస్థాయిలో వివాదాలకు అవకాశం లేకుండా యువత సమన్వయంతో సహచరులను, చుట్టుపక్కల వారిని ముందుకు తీసుకువెళ్లాలని ఎస్సై ఎన్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పెద్దకాపువీధి, చిన్నకాపువీధి, గటాలదెప్పి వారివీధి, గేదలవారి వీధిలో ఆదివారం రాత్రి పర్యటించారు. అక్కడి ప్రజలు, యువతతో మాట్లాడారు. రాజకీయ విశ్లేషణలు అభివృద్ధిని ఆకాంక్షించేలా ఉండాలని, కవ్వింపులకు, ఘర్షణలకు తావిచ్చేలా ఉండకూడదన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో స్థానికులు పట్టణ పురోభివృద్ధి దిశగా అడుగులు వేయాలన్నారు. ముఖ్యంగా యువత ఉపాధిమార్గాలను అన్వేషించుకోవాలని సూచించారు. హద్దుమీరి ప్రవర్తించి చిక్కుల్లో పడవద్దని హితవుపలికారు.

రక్తదానం చేయండి.. ప్రాణాలు కాపాడండి



రక్తదానం చేస్తున్న దాతలు (ఫైల్)

- అపోహలు విడనాడాలి...
- సామాజిక సేవగా భావించి ముందుకు రావాలి
- జిల్లా బ్లడ్ బ్యాంక్ నుంచి నెలకు 600 యూనిట్ల వరకు రక్తం వినియోగం

పార్వతీపురం టౌన్ : ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి సమయానికి రక్తం అందక మృత్యువాత పడుతున్న సంఘటనలు అక్కడక్కడా చోటు చేసుకుంటున్నాయి. అటువంటి వారి ప్రాణాలు కాపాడాలంటే ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని సమాజ సేవకులు పిలుపునిస్తున్నారు. రక్తదానంపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని, ఆరోగ్యంగా ఉన్నవారు ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు. రక్తదానంపై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ, ప్రజలను చైతన్య పరుస్తున్నారు. ప్రభుత్వం కూడా ఆ దిశగా ఒక అడుగు ముందుకేసి ప్రచారం విస్తృతం చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తుండడంతో రక్తసేకరణ ఫలితాలు ఆశాజనకంగా ఉంటున్నాయి. దాతలకు రక్తం ఇచ్చేటప్పుడు డోనర్ కార్డులు ఇచ్చి వారికి గాని, వారి కుటుంబాలకు గాని ఎప్పుడైనా రక్తం అవసరమైతే ఆ కార్డులను వినియోగించుకునే అవకాశం కల్పిస్తుండడంతో రక్తదాతల సంఖ్య పెరుగుతోంది.

ఐదేళ్ల కిందట ఐఆర్‌సీఎస్ రక్తనిధి కేంద్రం

పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో ఐదేళ్ల కిందట ఐఆర్‌సీఎస్ రక్తనిధి కేంద్రం నిర్వహించగా, తర్వాత ప్రభుత్వం దీన్ని తమ పరిధిలోకి తీసుకొని రక్తనిధి కేంద్రంగా కొనసాగిస్తోంది. ప్రస్తుతం జిల్లా రక్తనిధి కేంద్రం నుంచి నెలకు 600 యూనిట్ల రక్తం వినియోగం అవుతోంది. గతంలో ఎవరికైనా రక్తం అవసరమైతే రూ. 850 చెల్లించి ఒక యూనిట్ రక్తం ప్యాకెట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రక్తం అవసరమైన వారికి ఉచితంగా అందజేస్తున్నారు. సేకరించిన రక్తాన్ని రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, సికిల్‌సెల్ ఎనిమియా, తలసేమియా, డయాలసిస్ పేషెంట్లకు వినియోగిస్తున్నారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి యువత ముందుకు వచ్చి రక్తదానం చేస్తే ఎదుటవారి ప్రాణాలు కాపాడవచ్చని రక్తనిధి కేంద్రం ఉద్యోగులు చెబుతున్నారు.

సామాజిక సేవగా భావిస్తా..



రక్తదానం సామాజిక సేవగా భావిస్తూ ఇప్పటివరకు 99 సార్లు రక్తదానం చేశాను. మరొకరికి రక్తం అందించి ప్రాణాలు కాపాడడం ఆనందంగా భావిస్తాను. యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయం. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవు.

–బోటు రామకృష్ణ, రెడ్‌క్రాస్ సభ్యుడు

తృప్తి ఉంటుంది..



ఇప్పటివరకు 113 సార్లు రక్తదానం చేశాను. రక్తదానం చేయడంతో ఒకరి ప్రాణాన్ని కాపాడమనే తృప్తి ఉంటుంది. పైగా నూతన ఉత్సాహంతో మరింత ఆరోగ్యంగా ఉంటాం. నేను నా మిత్రులందరికీ రక్తదానం చేయమని సలహా ఇస్తూ ఉంటాను.

–దీవీవీ గుప్తా, వైకేఎం కాలనీ, పార్వతీపురం

రక్తదాతలు అపోహలు వీడాలి



అపోహలను వీడి రక్తదానానికి ముందుకు రావాలి. రక్తదానం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది. జిల్లా ఆస్పత్రితో పాటు కురుపాం, సాలూరు, బొబ్బిలి పీహెచ్‌సీలలో రక్తనిల్వ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆయా ప్రాంత రోగులకు రక్తం అందుబాటులో ఉండేటట్లు చూస్తున్నాం.

–డాక్టర్ వాగ్దేవి, పార్వతీపురం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

శిశు ఆరోగ్యానికి రక్ష

- నవజాత శిశు వైద్య సేవలకు నియోనేటల్ అంబులెన్స్‌లు
- అందుబాటులో అత్యాధునిక వైద్య పరికరాలు
- జిల్లాలో రెండు వాహనాల ద్వారా సేవలు

పాలకొండ రూరల్: ప్రస్తుత యాంత్రిక సమాజంలో అప్పుడే పుట్టిన శిశువుల్లో కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఒక్కోసారి కాన్పు జరిగిన వెంటనే తల్లి పొత్తిళ్ల నుంచి శిశువులను ఆస్పత్రులకు తరలించాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. ఈ తరలించే క్రమంలో శిశువులకు అందాల్సిన వైద్యం అందకపోవడంతో పరిస్థితి విషమించి మృత్యు ఒడిలోకి చేరాల్సిన దయనీయ పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. ఏజెన్సీ మిళితమై ఉన్న జిల్లాలో ఇటువంటి పరిస్థితులు లేకుండా నవజాత శిశు రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. అత్యాధునిక సాంకేతిక పరికరాలతో కూడిన నియోనేటల్ అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ 108 వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి ద్వారా జిల్లాలో పార్వతీపురం, పాలకొండ డివిజన్‌లో విస్తృత సేవలు అందజేస్తున్నారు. నవజాత శిశువు వైద్యానికి కుటుంబ సభ్యుల కోరిక మేరకు ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించే విధంగా వెసులుబాటు కల్పించారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 28 రోజుల వయసు కలిగిన చిన్నారులకు అత్యవసరమైన వైద్య సేవల కోసం నిరంతరం అందుబాటులో ఉన్న ఈ నియోనేటల్ 108 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

అత్యాధునిక పరికరాలు

నవజాత శిశు రక్షణ కోసం అందుబాటులో ఉన్న నియోనేటల్ 108 వాహనంలో అత్యాధునిక సాంకేతిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. కార్పొరేట్ ఆస్పత్రుల మాదిరిగా ఈ వాహనంలో చిన్నారుల వైద్యం కోసం వెంటిలేటర్, ఇంక్యూబేటర్, మోనిటర్, సిరంజ్ అండ్ ఇన్ఫ్యూజన్ పంప్ తదితర సదుపాయాలు కల్పించారు. వాటి పని తీరును ఒక్క సారి పరిశీలిస్తే..

ఇంక్యూబేటర్: నెలలు నిండక ముసుపు పుట్టిన పిల్లలకు, తక్కువ బరువుతో పుట్టిన పిల్లలకు, నెలలు నిండినప్పటికీ పూర్తిగా శరీర భాగాలు అభివృద్ధి చెందక తక్కువ ఉష్ణోగ్రత (హైపోథార్మియా) గల శిశువులను ఈ పరికరంలో ఉంచి ఆస్పత్రికి తరలిస్తారు.

వెంటిలేటర్: అప్పుడే పుట్టిన శిశువుతో పాటు 28 రోజుల వయసు కలిగిన పిల్లలు తమంతట తాము శ్వాస తీసుకోలేని పరిస్థితుల్లో ఈ వైద్య పరికరంతో కృత్రిమ శ్వాస అందజేస్తారు.

మోనిటర్: శిశువు గుండె వేగాన్ని, రక్తపోటు, రక్తంలో ఆక్సిజన్ శాతం, శారీరక ఉష్ణోగ్రత ప్రామాణికాన్ని నిర్దేశించేందుకు ఈ వైద్య పరికరం సాయపడుతుంది.

సిరంజ్ అండ్ ఇన్ఫ్యూజన్ పంప్: నియోనేటల్ 108 వాహనంలో అందుబాటులో ఉన్న మరో కీలకమైన వైద్య పరికరం సిరంజ్ అండ్ ఇన్ఫ్యూజన్ పంప్. నవజాత శిశువులను ఇతర ఆస్పత్రులకు తరలిస్తున్నప్పుడు వారికి అవసరమైన మందులను నిర్దేశిత మోతాదులో అందజేసేందుకు ఈ వైద్య పరికరం ఉపయోగపడుతుంది.



పాలకొండలో అందుబాటులో ఉన్న నియోనేటల్ 108 వాహనం

అందుబాటులో ఉంటాం

నవజాత శిశువులకు అత్యవసర సమయంలో ఐసీయూలో అందజేసే వైద్య సేవలు మాదిరిగా నియోనేటల్ 108 వాహనంలో అత్యాధునిక వైద్య సేవలు అందజేస్తాం. పాలకొండ డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా గిరిజన ఆవాసాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో ప్రజలకు సేవలు అందించేందుకు 24 గంటలు మేము అందుబాటులో ఉంటాం.

– గిరి గణపతి, ఎమర్జన్సీ మెడికల్ టెక్నీషియన్

ప్రత్యేక అవసరాలను దృష్టిలో పెట్టుకుని

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒకటి చొప్పున నియోనేటల్ అంబులెన్స్‌లను కేటాయించింది. అయితే కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో ఏజెన్సీ ఏరియా ఎక్కువగా ఉన్నందున మన జిల్లాకు రెండు వాహనాలను కేటాయించింది. పార్వతీపురం, పాలకొండ డివిజన్ల పరిధిలో ఇవి సేవలందిస్తున్నాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతవాసులకు ఈ వాహన సేవలపై అవగాహన పెంచేలా కార్యక్రమాలు చేపడుతున్నాం. అత్యాధునిక వైద్య పరికరాలు, అత్యవసర సేవలు ఈ వాహనంలో బిడ్డకు లభిస్తాయి. గత 15 నెలల వ్యవధిలో 983 మంది పిల్లలకు ఇందులో వైద్యసేవలు అందించాం.

– ఎస్.మన్మథనాయుడు, 108 జిల్లా మేనేజర్

ఎస్ఎన్‌సీయూకు అనుసంధానంగా..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఈ నియోనేటల్ అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ 108 వాహనాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రిలో ఉన్న ఎస్ఎన్‌సీయూ(నవజాత శిశు రక్షణ విభాగం)లో అందుబాటులో ఉంది. కొన్ని సందర్భాల్లో నవజాత శిశువులను ఇతర ఆస్పత్రులకు తరలించే క్రమంలో ఈ వాహనంలో అన్ని రకాల వైద్య సేవలు అందించేలా దీన్ని తీర్చిదిద్దారు. ఇందులో అధునాతన వైద్య పరికరాలు ఏర్పాటు చేశారు. అత్యవసర సమయాల్లో వీటి సేవలను ప్రజలు వినియోగించుకోవాలి.

– జె.రవీంద్రకుమార్, ఆర్ఎంఓ, చిన్నపిల్లల వైద్యనిపుణులు, ఏరియా ఆస్పత్రి, పాలకొండ